క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 24న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కిషన్‌పుర ప్రాంతంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, బొక్కలగడ్డ, శ్రీనగర్ కాలనీ, పోచమ్మకుంట కాలనీ, కమ్మరివాడ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 10.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

హసన్‌పర్తి: మండల పరిషత్ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదికను మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకంలో భాగంగా 2023 మార్చి నుంచి 2024 వరకు చేపట్టిన పనులపై గ్రామస్థాయిలో సామాజిక తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఆయా గ్రామాలకు సంబంధించిన తుది నివేదికలను ప్రజావేదికలో సమర్పించనున్నట్లు పేర్కొన్నారు.

రేపు భద్రూనాయక్ సంస్మరణ సభ

హన్మకొండ కల్చరల్: సమన్యాయం కోసం సామాజిక, ప్రజా ఉద్యమాల్లో పాల్గొని పోరాటం చేసిన కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఆచార్య జి.భద్రూనాయక్ సంస్మరణ సభను బుధవారం నిర్వహించనున్నట్లు తెలుగు విశ్వవిద్యాలయం వరంగల్ జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబురావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠం వరంగల్ ప్రాంగణంలో జరగనున్న కార్యక్రమంలో విద్యార్థులు, కవులు, సాహితీవేత్తలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని భద్రూనాయక్‌కు నివాళులర్పించాలని కోరారు.

14న పద్మశాలి ప్రతిభా పురస్కారాలు

ఖిలా వరంగల్: తెలంగాణ పోపా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 14న పద్మశాలి ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని వందన హైస్కూల్‌లో పురస్కారాల కరపత్రాలను సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్ఎస్‌సీ, నీట్, ఐఐటీ వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు ప్రదానం చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆడెపు శ్యామ్, గుండు కామేశ్వర్, పాము శ్రీనివాస్, గోషికొండ సుధాకర్, మాటేటి అశోక్, రాజగోవింద్, సుభాష్, పెద్దన్న, బైరి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

గోవిందరాజుల గుట్టకు రోడ్డు మార్గంపై అధ్యయనం



వరంగల్ చౌరస్తా: గోవిందరాజుల గుట్టపైకి రోడ్డు మార్గం కోసం దేవాదాయ శాఖ అధికారులు సోమవారం అధ్యయనం చేశారు. దేవాదాయ డిప్యూటీ కమిషనర్ కాంతారావు, ఏసీ సునీత, ఏఈ దుర్గా ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ సంజీవ, స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ పరిశీలించారు. కూరగాయాల మార్కెట్ పాతవాటర్ ట్యాంక్‌పై నుంచి తక్కువ వ్యయం అవుతుందని నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో స్థానికులు చింతాకుల సునీల్ కుమార్, సదానందం, పాలక వర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత



మడికొండ: మడికొండ పోలీసుస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ జయరాజ్.. తన పుట్టిన రోజు సందర్భంగా మడికొండ గ్రామానికి చెందిన రుద్రారపు స్వరూప కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు పేదలకు తమవంతుగా చేయూతనందించాలని పిలుపునిచ్చారు.

మదర్సా విద్యార్థులకు దుస్తుల పంపిణీ



న్యూశాయంపేట: గ్రేటర్ వరంగల్ పరిధిలోని వివిధ మదర్సాల్లో అరబ్బీ విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థులకు ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఒక్కో విద్యార్థికి రెండు జతల చొప్పున దుస్తులను సోమవారం అందజేశారు. సామాజిక సేవలో భాగంగా తమ సంస్థ ఆధ్వర్యంలోని కుట్టుశిక్షణ కేంద్రంలో కుట్టించిన దుస్తులను విద్యార్థులకు అందజేసినట్లు సంస్థ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ కలీం తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ బాధ్యులు మహ్మద్ సలీంపాషా, మదర్సా నిర్వాహకులు జాఫరుల్ అబెదీన్, అతీఖుర్ రహమాన్, తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులను కఠినంగా శిక్షించాలి

హన్మకొండ అర్బన్: పెద్దమ్మగడ్డలోని దళితుల శ్మశాన వాటికను అక్రమంగా కూల్చివేసి కబ్జా చేయాలని చూస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ పెద్దమ్మగడ్డలో నల్లెల కట్టయ్య అనే వ్యక్తి నాలుగు దశాబ్దాల క్రితం ఇచ్చిన భూమిని దళితులు శ్మశాన వాటికగా ఉపయోగించుకుంటారని గుర్తుచేశారు. ఈనెల 19న శ్మశాన వాటిక ప్రహరీని కబ్జాదారులు కూల్చివేశారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సారంపల్లి వాసుదేవరెడ్డి, నార్త్ మండల కార్యదర్శి గాదె రమేష్, నాయకులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

దళితులపై అఘాయిత్యాలను అరికట్టాలి

దళితులపై అత్యాచారాలు, అఘాయిత్యాలను అడ్డునేందుకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని దళిత హక్కుల పోరాట సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నిమ్మల మనోహర్ డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులకు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రొంటాల దేవా, జిల్లా గౌరవ అధ్యక్షులు మద్దెల ఎల్లేష్, మునిగాల భిక్షపతి, శంకర్ నాయక్, కొట్టె వెంకటేష్, బొడిగె కమలాకర్, వనజ, లత, రాణి, తిరుమల లత, కవిత, సరోజన పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

నిందితుల బెయిల్ రద్దు చేయాలి

హన్మకొండ: దళిత ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ బలవన్మరణానికి కారకులైన సీఐ జితేందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు సన్యాసి నాయుడు, శివ నాగరాజు, సుభాషీ శేఖర్లకు హైకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలని వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్, కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గురిమిల్ల రాజు కోరారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఆదివారం రాత్రి రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. తొలుత ఎస్సై శ్రీనివాస్ మృతిపై మౌనం పాటించి సంతాపం తెలిపారు. కేఎంపీ ఎస్ ఆల్ ఇండియా కన్వీనర్ బండారి లక్ష్మయ్య, న్యాయవాది బండి మొగిలి, ఆయా సంఘాల నాయకులు మిద్దెపాక ఎల్లయ్య, కేడల ప్రసాద్, బాదావత్ రాజు, చుంచు రాజేందర్, ఎ.క్రాంతి కిరణ్, గన్నారం సరోజన, గడ్డం శరత్ పాల్గొన్నారు.



ఎస్సై మృతికి సంతాపం తెలుపుతున్న నాయకులు

పారిశుద్ధ్య కార్మికురాలికి పరామర్శ



ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న ఎంపీ కావ్య

ఎంజీఎం: రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పారిశుద్ధ్య కార్మికురాలు సమ్మక్కను ఎంపీ కడియం కావ్య సోమవారం పరామర్శించారు. సెప్టెంబర్ 8వ తేదీన హనుమకొండ ప్రధాన రహదారిపై విధులు నిర్వర్తిస్తున్న సమయంలో గుర్తు తెలియని కారు సమక్కను ఢీకొట్టడంతో ఆమె రెండు కాళ్లు విరిగిపోయి ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ క్రమంలో పారిశుద్ధ్య కార్మికురాలికి అందుతున్న వైద్యసేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

కార్మిక చట్టాలను కాపాడుకుందాం..



నిరసన తెలుపుతున్న నాయకులు

ఖిలా వరంగల్: నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి కార్మిక చట్టాలను కాపాడుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా కరీమాబాద్ రోడ్డుపై సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్రం తీసుకొచ్చి కార్మిక హక్కులను కాలరాస్తోందని వాపోయారు. విదేశీ, స్వదేశీ పెట్టుబడుదారులకు అనుకూలంగా చట్టాలు చేసి ప్రజా సంపదను కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.

పొట్టి శ్రీరాములు పేరునే కొనసాగించాలి



హసన్‌పర్తి: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరునే కొనసాగించాలని ఆర్యవైశ్య సంఘం హసన్‌పర్తి మండల అధ్యక్షుడు చకిలం రాజేశ్వర్‌రావు కోరారు. ఈమేరకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును తొలగించి సురవరం ప్రతాప్‌రెడ్డి పేరును పెట్టే ఆలోచనలో ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. ఈ ఆలోచనను వెంటనే విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు గౌరిశెట్టి కృష్ణమూర్తి, సంద్రు నాగేందర్, చిదర పురవర్ధన్, అప్పని శంకర్, నాగమళ్ల సుధీర్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సైబర్ మోసగాళ్ల బారిన పడొద్దు

కాజీపేట అర్బన్: సైబర్ మోసగాళ్ల బారిన పడకుండా విద్యార్థి దశ నుంచే సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని మడికొండ ఇన్‌స్పెక్టర్ పి.కిషన్ సూచించారు. కాజీపేట మండలంలోని తరాలపల్లి గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆపదలో ఉన్నప్పుడు డయల్ 100కు కాల్ చేయాలని అన్నారు. సైబర్ మోసానికి గురైనట్లు గ్రహిస్తే వెంటనే 1930 నంబర్‌కు కాల్‌చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని చెప్పారు. ప్రయాణంలో ట్రాఫిక్ రూల్స్ పాటించాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, మడికొండ పోలీస్‌స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ కిషన్

బీఆర్ఎస్ నాయకులపై కేసు కొట్టివేత



కేసు నుంచి విముక్తులైన నాయకులు, న్యాయవాదులు

హన్మకొండ: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ నాయకులపై నమోదైన కోడ్ ఉల్లంఘన కేసును హనుమకొండ పీసీఆర్ కోర్టు సోమవారం కొట్టేసింది. గత ఏప్రిల్‌లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్నికల ప్రవర్తన, నియమావళిని ఉల్లంఘిస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రహీం, శ్రీను, రంజిత్, స్వామి, సుధాకర్ ప్రచారం చేశారనే ఆరోపణలపై హనుమకొండ పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణకు రాగా, ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ లీగల్ సెల్ అధ్యక్షులు గుగ్రాల వినోద్ కుమార్, వేణు పటేల్, లీగల్ సెల్ సభ్యుల వాదనలు వినిపించారు. వాదనలు విన్న అనంతరం కేసు కొట్టివేశారు. న్యాయ సహాయం అందించేందుకు కృషి చేసిన మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌కు, న్యాయవాదులకు వారు ధన్యవాదాలు తెలిపారు.

క్రైం కార్నర్

విద్యార్థి ఆత్మహత్య

హసన్‌పర్తి: మానసిక వేదనకు గురైన ఓ విద్యార్థి ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వంగపహాడ్ సోమవారం జరిగింది. వంగపహాడ్ గ్రామానికి చెందిన దుండ్ర శ్రీనివాస్(20).. జయశంకర్ భూపాలపల్లి అగ్రికల్చర్ యూనివర్సిటీలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. కొంత కాలంగా అతడు మానసిక వేదనకు గురవుతున్నాడు. ఈక్రమంలో ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

ఖిలా వరంగల్: రంగశాయిపేట ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. పాలకుర్తి సతీష్ ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపం చెంది ఇంట్లో నుంచి ఈనెల 17న బయటికి వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో భార్య పాలకుర్తి అనిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత

మామునూరు: ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట గ్రామానికి చెందిన 7వ తరగతి విద్యార్థి బోలు చంద్రశేఖర్ (12) సోమవారం ఉదయం చదువు విషయంపై తల్లిదండ్రులు మందలించారు. దాంతో ఆ బాలుడు ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించకపోవడంతో బాలుడి తండ్రి పాలరాజు ఫిర్యాదు మేరకు మామునూరు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ సోమవారం మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఎస్సై శ్రీకాంత్ బృందం పాపాయిపేట చమన్ వద్ద ఆ విద్యార్థిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.

2కిలోల గంజాయి స్వాధీనం

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వే స్టేషన్‌లో శివనగర్ ఆటో స్టాండ్ వద్ద మిల్స్‌కాలనీ ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో సోమవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి గ్రామానికి చెందిన కింసారపు అఖిలాష్ వద్ద 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అఖిలాష్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య వివరించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రామన్నపేట: నగరంలోని ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోస్టాఫీస్ సమీపంలోని ఎల్‌బీఆర్ నగర్‌లో ఓ ఇంట్లో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. వారి నుంచి రూ.6,420, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులు వరంగల్ ఎల్‌బీఆర్ నగర్ అండర్ బ్రిడ్జికి చెందిన దామెరకొండ ప్రశాంత్, శివనగర్‌కు చెందిన జి.రవి, లేబర్ కాలనీకి చెందిన పి.హరీష్, ఎల్‌బీఆర్ నగర్‌కు చెందిన బి.సంతోష్‌ను అదుపులోకి తీసుకొని ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అప్పగించినట్లు వివరించారు. టాస్క్‌ఫోర్స్ దాడుల్లో ఇన్‌స్పెక్టర్ ఎల్.పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

12 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

కాజీపేట: రవాణకు సిద్ధంగా ఉన్న 12క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని డీజిల్‌కాలనీ వద్ద కాజీపేట పోలీసులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన మాట్ల రమేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పటిక, నల్లబెల్లం స్వాధీనం

కాజీపేట: రైల్వేస్టేషన్ సమీపంలో రవాణాకు సిద్ధంగా ఉన్న 1180 కిలోల నల్లబెల్లం, 170 కిలోల పటికను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన బోడరాజు, మాలోతు రాములు, కెలోతు మాజీ, భూక్య పద్మపై కేసు నమోదు చేసినట్లు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు.

సంక్షిప్తంగా

మార్కెట్ బైలాను అమలు చేయండి

వరంగల్: వ్యవసాయ మార్కెట్‌లో బైలాను తూచా తప్పకుండా అమలు చేసి రైతుల పంటలను దోచుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకెఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. ఏఐకేఎఫ్ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం.. మార్కెట్ కార్యదర్శి పి.నిర్మలను సోమవారం కలిసి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలకు రక్షణ కల్పిస్తూ అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ధరలు పెంచాలన్నారు. ఏఐకేఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్‌రెడ్డి హంసారెడ్డి, సంఘాల నాయకులు గోనె కుమారస్వామి, నర్ర ప్రతాప్, జగదీశ్వర్, ఇస్మాయిల్, నాగేష్ పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

నయీంనగర్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ కిషన్‌పుర చైతన్య డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న టెక్నో విస్టా కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగంలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సీడీయూ కులపతి సీహెచ్‌వి.పురుషోత్తం రెడ్డి, డీన్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

ఖిలా వరంగల్: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, యూనివర్సిటీ వీసీలను నియమించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో తమ్మెర భవనలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో విద్యారంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. మే21న యూనివర్సిటీ వీసీల పదవీ కాలం పూర్తికాగా, నేటికీ నియమించలేదని విమర్శించారు. సమావేశంలో మణికంఠరెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిడ్డి పార్థసారధి, ల్యాదల్ల శరత్, ఏఐఎస్ నేతలు అంజి, వివకుమార్, అభిరామ్, సాగర్, మహేష్ పాల్గొన్నారు.

పేదల ఇళ్లను రెగ్యులరైజ్ చేయండి

ఖిలా వరంగల్: పేదల ఇళ్లను భేషరతుగా రెగ్యులరైజ్ చేయాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ ఎస్‌ఆర్‌ఆర్‌తోటలో నాయకుడు ఎగ్గెని మల్లి కార్జున్ అధ్యక్షతన ఏరియా జనరల్ బాడీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ త్యాగాలు, ఆశయాలతో సాధించుకున్న స్వరాష్ట్రంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఆరోపించారు. ఎన్నికల హామీలను సీఎం రేవంత్ రెడ్డి విస్మరిస్తున్నారని అన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, ఐతం నగేష్, నరసయ్య, కృష్ణ, గణేష్ రాజేందర్, శివ, రాజేందర్, శివ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులకు సమాధుల భూమి కేటాయించాలి

కాజీపేట రూరల్: మృతిచెందిన దళిత క్రైస్తవులను సమాధి చేసేందుకు భూమి కేటాయించాలని, మణిపూర్ రాష్ట్ర క్రైస్తవ కుటుంబాలకు న్యాయం, రక్షణ కల్పించాలని రాష్ట్ర షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంస్థ ఉపాధ్యక్షుడు రడపాక పరంజ్యోతి కోరారు. కాజీపేట ఫాతిమా కెథడ్రల్ చర్చికి ఆదివారం వచ్చిన కేంద్రమంత్రి జార్జ్ కురియన్‌కు వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని దళితుల భూములకు రక్షణ కల్పించాలని, అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వాలని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసులు నిర్వీర్యం కాకుండా చూడాలని పరంజ్యోతి పేర్కొన్నారు.

పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో క్లీన్ అండ్ గ్రీన్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ హెచ్ఆర్ఎం విభాగంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశుభ్రం చేసి, చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో విభాగం అధిపతి ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాస్ రావు, ప్రొఫెసర్ యాదగిరిరావు, అధ్యాపకులు ఎ.శ్రీనివాస్, చీకటి శ్రీనివాస్, ఉమాశంకర్, మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కోదండరామ్‌కు సన్మానం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీకి సోమవారం వచ్చిన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌ను కేయూ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ కుర్తా బాధ్యులు సన్మానించారు. కార్యక్రమంలో కుర్తా అధ్యక్షుడు ప్రొఫెసర్ సదానందం, జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ వడ్డె రవీందర్, ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎర్రగట్లు స్వామి, కోశాధికారి ప్రొఫెసర్ వీరన్ననాయక్, బాధ్యులు ప్రొఫెసర్ సీహెచ్.సమ్మయ్య, సుధాకర్, రిటైర్డ్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవరెడ్డికి..

హన్మకొండ: కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన గంట సంజీవరెడ్డిని టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు సన్మానించారు. హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయానికి సంజీవరెడ్డి సోమవారం రాగా, రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు.

భీమారంలో ఉచిత వైద్య శిబిరం

హసన్‌పర్తి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో నగరంలోని 55వ డివిజన్ భీమారంలో ఉచిత వైద్యశిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురిని పరీక్షించి 21మందికి మలేరియా, డెంగీ లక్షణాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించి మందులు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ జక్కుల రజిత మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, మెడికల్ ఆఫీసర్ మానస, హెల్త్ సూపర్‌వైజర్లు లచ్చులు, రుతమ్మ, హెల్త్ అసిస్టెంట్లు సంతోష్, మోహసిన్, నాగయ్య పాల్గొన్నారు.

సొసైటీలో అవకతవకలపై విచారణ చేయించండి

హసన్‌పర్తి: పెగడపల్లి సొసైటీలో జరిగిన అవకతవకలపై విచారణ చేయించాలని గ్రీవెన్స్‌లో కలెక్టర్ ప్రావీణ్యకు రైతులు సోమవారం ఫిర్యాదు చేశారు. సొసైటీ పరిధిలో 1,050 మంది రైతులకు రూ.9.50కోట్ల రుణాలు మాఫీ కాలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పెద్ది మహేందర్‌రెడ్డి, రైతులు సంపత్‌రెడ్డి, అనిల్, తిరుపతిరెడ్డి, శ్రీధర్, సుధాకర్, అభిషేక్ పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'కు తరలిన కార్మికులు

కాజీపేట: ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడికి కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈమేరకు హనుమకొండ జిల్లా నుంచి పలువురు కార్మికులు ప్రత్యేక వాహనాల్లో సోమవారం తరలివెళ్లారు. ఈమేరకు కాజీపేట భవన నిర్మాణ కార్మికుల అడ్డాలో జెండా ఊపి బస్సు యాత్రను సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎంజాల మల్లేశం ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేలు సారంగపాణి, కొండన్న, సాయికుమార్, జక్కుల రమేష్, బాలశౌరి, కుమార్, శ్యామ్ పాల్గొన్నారు.

ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

న్యూశాయంపేట: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను తమ బాధ్యతల నుంచి తప్పించుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దాన్ని ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సారంగపాణి డిమాండ్ చేశారు. హనుమకొండలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రామమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజేందర్, పూర్ణచందర్, భద్రయ్య పాల్గొన్నారు.

మహిళలకు అధిక ప్రాధాన్యం

ఖిలా వరంగల్: పార్లమెంట్‌లో మహిళా బిల్లును ప్రవేశపెట్టి, చట్ట సభల్లో అతివలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు సంయుక్త మోర్చా ప్రముఖ్ డాక్టర్ వన్నాల వెంకటరమణ తెలిపారు. వరంగల్ 32వ డివిజన్ ఎస్ఆర్ఆర్‌తోటలో మహిళా మోర్చా అధ్యక్షురాలు ఐతం స్వరూప ఆధ్వర్యంలో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కాసు శిల్పతో కలిసి సభ్యత్వ నమోదును సోమవారం ప్రారంభించి ఆయన మాట్లాడారు. సభ్యత్వాలతోనే బీజేపీ బలోపేతం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వంచనగిరి సాకేత్, అరవింద్, సామల సంధ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదవులకు రాజీనామా చేసి పార్టీలో చేరండి

వరంగల్: ఇతర పార్టీ నుంచి పోటీ చేసి గెలుపొంది, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు తమ పదవులకు రాజీనామా చేసి పార్టీలోకి రావాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు మహ్మద్ అయూబ్, నాయకులు కొత్తపల్లి శ్రీనివాస్, మడిపల్లి కృష్ణగౌడ్, మీసాల ప్రకాశ్ డిమాండ్ చేశారు. ఎల్‌బీనగర్‌లోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో కాంగ్రెస్‌కు ద్రోహం చేసి అప్పటి అధికార పార్టీలో చేరి ఇప్పుడు మళ్లీ అదే పద్ధతిలో తూర్పులోని కాంగ్రెస్ పార్టీని నాశనం చేసేందుకు కొంతమంది కంకణం కట్టుకున్నారని విమర్శించారు. టీపీసీసీ అధ్యక్షుడిని కలవడం తప్పుకాదని, తూర్పు అభివృద్ధి కావడం లేదని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. గ్రూపు రాజకీయాలకు పాల్పడొద్దని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యకు సూచించారు. సమావేశంలో మంతెన సునీత, జన్ను వివేక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అయూబ్

అందుబాటులో లేని నాయకులతో వేగలేం



మాట్లాడుతున్న కార్పొరేటర్ నరేంద్రకుమార్

వరంగల్: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలిచినా అభివృద్ధిని పట్టించుకోకుండా అందుబాటులో లేని నాయకులతో వేగలేకపోతున్నామని 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసేందుకు జిల్లా పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతో కలిసి సోమవారం హైదరాబాద్ తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పులోని కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి విబేధాలు లేవని, కేవలం ఈప్రాంత అభివృద్ధి కోసమే పోటీ పడుతున్నామని అన్నారు. తూర్పు నుంచి గెలిచిన నాయకులు కేవలం అధికారానికే పరిమితమై ప్రజల కష్టాలు పట్టించుకోవడం లేదన్నారు. ఈక్రమంలో తామంతా కలిసికట్టుగా తూర్పు అభివృద్ధి జత కడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తత్తరి లక్ష్మణ్, నాయకులు కరాటే ప్రభాకర్, గోరంటల రాజు, రాచర్ల కుమార్, పరమేష్ పటేల్ పాల్గొన్నారు.

వైభవంగా బతుకమ్మ, దసరా ఉత్సవాలు నిర్వహిస్తాం

ఖిలా వరంగల్: సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలను రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధరరావు సహాయ సహకారాలతో వైభవంగా నిర్వహిస్తామని ఉర్సు రంగలీల మైదానం సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్‌బాబు తెలిపారు. ఈమేరకు వరంగల్ కరీమాబాద్ రోడ్డులోని ఆదర్శ ట్రస్ట్ భవనంలో ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్, కోశాధికారి మండ వెంకన్న గౌడ్ అధ్యక్షతన బతుకమ్మ, దసరా ఉత్సవ కమిటీ సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సంజయ్‌బాబు మాట్లాడుతూ గతేడాది ఎన్నికల కోడ్ కారణంగా ప్రభుత్వం తరఫున ఏర్పాట్లు చేయకున్నా దాతల సహకారంతో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సొంత ఖర్చులతో వేడుకలు నిర్వహించినట్లు గుర్తు చేశారు. సమావేశంలో ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షుడు గోనె రాంప్రసాద్, వంగరి కోటేశ్వర్, వెలిగె శివమూర్తి, వంగరి కోటేశ్వర్, రంజిత్‌గౌడ్, సందీప్, సుంకరి సంజీవ్, అజయ్, బొల్లం రాజు, మహేష్, కత్తెరశాల వేణు, శ్రీను, బిట్ల క్రాంతి, గట్టు రమేష్, తదిరులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న సంజయ్‌బాబు

ఉద్యోగులు, ప్రొఫెషనల్స్ భాగస్వాములు కావాలి

హన్మకొండ: రాష్ట్రంలో ఉన్న సివిల్స్, గ్రూప్ -1, గ్రూప్ -2 వంటి ఉన్నత స్థానంలో ఉన్న ఉద్యోగులు, ప్రొఫెషనల్స్.. ముదిరాజ్ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ -తెలంగాణలో భాగస్వాములు కావాలని అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ కోరారు. అప్పుడే జాతి అభివృద్ధి పథంలో నడుస్తుందని అన్నారు. అడిషనల్ ఎస్పీ గుంటిపల్లి మధుసూదన్ రావు ముదిరాజ్‌ను హైదరాబాద్‌లో మెపా -తెలంగాణ నాయకులు ఆదివారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిసి కుల ఆరాధ్య దైవం పెద్దమ్మతల్లి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ విద్యార్థుల విద్య, ఉద్యోగాల అవకాశాలపై చర్చించారు. కార్యక్రమంలో మెపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిరుత వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శులు దండు చిరంజీవి, నీరటి రాజు, తోట రమేష్, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ, మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుండి అశోక్, నాయకులు తోట సురేష్, సంపత్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



పెద్దమ్మతల్లి చిత్రపటాన్ని బహూకరిస్తున్న నాయకులు